రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# మెరుగైన పాలన అందించేందుకు కృషి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయం ముందు గురువారం డిప్యూటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఆమె జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. మేడ్చల్ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్‌రెడ్డితో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన, ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యం, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై డీసీ వాణి వివరించారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ సహకార సంఘం



ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ముల్లి పావని



సర్కిల్ కార్యాలయం ముందు జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తున్న డిసి వాణిరెడ్డి

జంగయ్యయాదవ్, పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె రాజేశ్, ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామల అమరేందర్, నాగారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, జిల్లా మత్స్య శాఖ సొసైటీ డైరెక్టర్ మెడబోయిన వెంకటేశ్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్లుకడపోల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శులు మీసాల సుధాకర్‌రావు, మొల్గురం రామస్వామి, కందకట్ల మాధవ రెడ్డి, డీసీసీ మాజీ కార్యదర్శి ఉల్లి ఆంజనేయులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యోధుల త్యాగం వెలకట్టలేనిది

**వికారాబాద్, ప్రభాతవార్త:** రాచరిక వ్యవస్థ నుండి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధుల త్యాగం వెలకట్టలేనిదని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పోలీసు గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభాపతి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్, సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయులు పాల్గొని బ్రిటిష్ వారి నుండి భారత జాతిని విముక్తి చేశారన్నారు. ఆనాడు దేశవ్యాప్తంగా ఉన్న 562 సంస్థానాల్లో మెజారిటీ సంస్థానాలు భారతదేశంలో విలీనం అయినప్పటికీ, భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు నిజాం అంగీకరించకపోవడంతో 1948 సంవత్సరం సెప్టెంబర్ 17న భారత సైన్యం రంగంలోకి దిగి భారత యూనియన్ లో చేర్చడం జరిగిందన్నారు. నిజాం సంస్థానంలో భూస్వాములు, జమీందారులు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, ప్రజలను నానా రకాలుగా వేధించేవారని, రైతులు పండించిన పంటలో అగ్రభాగం పెత్తందారులకు పన్ను రూపంలో చెల్లించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో భారతదేశంలో కలవాలనే తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ, కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనంతో స్వేచ్ఛ, స్వాతంత్రం మన సొంతం కావడానికి ఎంతో మంది తెలంగాణ గడ్డమీద అసమాన త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఆనాటి త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్రం. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణను వికాసం వైపు నడిపించడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకువచ్చారన్నారు. గడిచిన వెయ్యి రోజుల ప్రజా ప్రభుత్వ పరిపాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని ఆయన తెలిపారు. వెయ్యి రోజుల పాలనలో రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలతో పాటు కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి అనేక సామాజిక అంశాల్లో కూడా దూరదృష్టితో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడిన తెలంగాణను గడిచిన వెయ్యి రోజుల్లో ముళ్లబాట నుంచి సుపరిపాలన వైపునకు ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు అన్ని వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని ఆయన అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1వ తేదీ నుంచి గడిచిన 32 నెలలుగా ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తోందని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా మొదటి తారీఖున జీతాలు చెల్లిస్తోందని, ఆరోగ్య భద్రత కార్డు లేకపోతే ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఆరోగ్య భద్రత కార్డులను ప్రభుత్వం పునరుద్ధరించిందని ఆయన అన్నారు. పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పై స్పీకర్ ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, అదనపు కలెక్టర్లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, ఆర్డీవోలు వాసుచంద్ర, అనిత, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్ అర్ద సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్





సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

# అమరవీరుల త్యాగాల ఫలితమే ...
# ప్రత్యేక తెలంగాణ

**రంగారెడ్డి అర్బన్, సెప్టెంబర్17, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు-వాణిజ్యం, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పిం చారు. సెప్టెంబర్17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమై 78 సంవత్సరాలు పూర్తిచేసుకుని 79వ సంవత్సరంలోకి అడుగుపెడు తున్న సందర్భంగా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యో గులు, పాత్రికేయులు, ఉద్యమకారులు, జిల్లా ప్రజలందరికీ శుభా కాంక్షలు తెలిపారు. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాలు జరుపుకున్నప్పటికీ హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడాల్సి వచ్చిందన్నారు. నైజాం పాలనలో భూస్వాములు, జమీందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌ల దోపిడీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. వెట్టిచాకిరి, అణచివేత, బానిసత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఉద్భవించిందన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి యోధులు ప్రజల హక్కుల కోసం పోరాడారని గుర్తుచేశారు.

**గ్రంథాలయ ఉద్యమం కీలక పాత్ర.....**

తెలంగాణ సాయుధ పోరాటం, సాంస్కృతిక ఉద్యమ చరిత్రలో గ్రంథాలయ ఉద్యమం కీలక మైలురాయిగా నిలిచిందని మంత్రి తెలిపారు. నాటి నిజాం పాలనలో తెలుగు భాష, సంస్కృతిపై ఆంక్షలు ఉన్న సమయంలో ప్రజల్లో రాజకీయ, సామాజిక చైతన్యం కల్పించేందుకు మేధావులు గ్రంథాలయాలను శక్తివంతమైన సాధనంగా మలుచుకున్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఆరుట్లగ్రామంలో గోవిందరావు గ్రంథాలయాన్ని స్థాపించగా, భాగత్ రామారావు, ఆరుట్ల రామచంద్రాచారి సహకరించారని తెలిపారు. 1936లో షాద్‌నగర్‌లో జరిగిన ఐదవ ఆంధ్ర మహాసభ, 1939లో మల్కాపురంలో జరిగిన ఏడవ ఆంధ్ర మహాసభలు తెలంగాణ ఉద్యమానికి, ప్రజల్లో చైతన్యానికి ఎంతో దోహదపడ్డాయని పేర్కొన్నారు.

**ఆపరేషన్ పోలోతో హైదరాబాద్ విలీనం....**

హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు అప్పటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ చర్యలు చేపట్టారని మంత్రి తెలిపారు. నిజాం విలీనానికి అంగీకరించకపోవడంతో 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం ఆపరేషన్ పోలోను ప్రారంభించిందన్నారు. చివరకు 1948 సెప్టెంబర్ 17న నిజాం భారత దేశంలో చేరుతున్నట్లు ప్రకటించడంతో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని వివరించారు.

**ప్రత్యేక తెలంగాణ కోసం సుదీర్ఘ ఉద్యమం...**

1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన అనంతరం తెలంగాణ ప్రజల హక్కులు, ప్రయోజనాల కోసం పలు దశల్లో ఉద్యమాలు జరిగాయని మంత్రి తెలిపారు. 1969లో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారని, వందలాది మంది ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజా సంఘాలు చురుకుగా పాల్గొన్నాయని తెలిపారు. సుదీర్ఘ ఉద్యమాలు, ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిందన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం.....**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అభయహస్తం పథకాల అమలును ప్రభుత్వం ప్రారంభించిందన్నారు.

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం....**

మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్ర మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 220 కోట్ల జీరో టికెట్లను వినియోగించుకుని మహిళలు సుమారు రూ.1,621 కోట్ల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని వివరించారు.

**రూ.500కే వంటగ్యాస్ సిలిండర్....**

మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 2,13,584 మంది లబ్ధిదారులకు 19,26,261 సిలిండర్లు అందించగా, ప్రభుత్వం రూ.62.86 కోట్ల సబ్సిడీ చెల్లించిందన్నారు.

**15,603 మందికి ఇందిరమ్మ ఇళ్లు....**

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా జిల్లాలో 15,603 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసి ఇప్పటివరకు రూ.340 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

**3.62 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి....**

గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే జిల్లాలోని 3,62,000 కుటుంబాలకు జీరో బిల్లులు జారీ చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.328.89 కోట్లను సబ్సిడీగా చెల్లించిందన్నారు.

**1.15 లక్షల కొత్త రేషన్ కార్డులు....**

కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 1,15,171 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ కూడా కొనసాగుతోందన్నారు.

**అర్హులకు కొత్తగా పెన్షన్లు....**

అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు వ్యాధిగ్రస్తులతో పాటు తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్తగా పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన కొనసాగిస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తన సందేశంలో పేర్కొన్నారు.



# పిఏసిఎస్ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ

**బషీరాబాద్, సెప్టెంబర్17, ప్రభాతవార్త:** నావంద్గి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా ఆసక్తికరంగా మారాయి. సొసైటీ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న అజయ్ ప్రసాద్ బుధవారం తన పదవికి రాజీనామా చేయడంతో పిఏసిఎస్ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ నెలకొంది. వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేయడం వెనక కారణాలపై సొసైటీ వర్గాల్లో భిన్నమైన చర్చలు జరుగుతున్నాయి. అదే సమయంలో తదుపరి చైర్మన్ ఎవరనే అంశం ప్రస్తుతం ప్రధాన చర్చగా మారింది. అజయ్ ప్రసాద్ వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో సొసైటీలోని రాజకీయ సమీకరణాలపై అందరి దృష్టిపడింది. ఇప్పటికే చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఇరు వర్గాలు తమతమ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు స్థానికంగా చర్చ సాగుతుంది. సొసైటీ పాలకవర్గంలో ఎవరివైపు మెజారిటీ మద్దతు ఉంటుందనే అంశం కీలకంగా మారనుంది.

**చైర్మన్ పీఠంపై పోటాపోటీ**

వైస్ చైర్మన్ రాజీనామా నేపథ్యంలో పిఏసిఎస్ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అజయ్ ప్రసాద్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నట్లు సొసైటీ వర్గాల్లో చర్చ జరుగుతుండగా, ఆయనకు అవకాశం దక్కకుండా మరో వర్గం పావులు కదుపుతోందని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. గత కొన్ని రోజుల ముందు ఓ వర్గం నాయకులు ఓ నేత ఇంట్లో జరిపిన రహస్య భేటీతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

**మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు..!**

చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి అవసరమైన మద్దతును కూడగట్టే దిశగా ఓ వర్గం ప్రయత్నాలు చేస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతుంది. ఒక్కో సభ్యుడి మద్దతు కీలకంగా మారడంతో సొసైటీ పాలకవర్గంలోని పరిణామాలపై సభ్యులు, రైతుల్లో ఆసక్తి నెలకొంది. ఎవరెవరు ఏ వర్గం వైపు నిలుస్తారన్న అంశం కూడా చర్చనీయంశంగా మారింది.

**రాజీనామాతో మారిన సమీకరణాలు**

వైస్ చైర్మన్ తన పదవికి రాజీనామా చేయడం సొసైటీ రాజకీయాల్లో కీలక పరిణామంగా పలువురు భావిస్తున్నారు. ఇప్పటివరకు వైస్ చైర్మన్‌గా కొనసాగిన ఆయన తదుపరి పరిణామాల్లో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరోవైపు చైర్మన్ పదవికి ప్రత్యామ్నాయ అభ్యర్థిని ముందుకు తీసుకురావాలని మరో వర్గం ప్రయత్నిస్తోందన్న ప్రచారం జరుగుతుంది.

**ఎవరి పంతం నెగ్గునో...**

పిఏసిఎస్ చైర్మన్ పీఠం కోసం సాగుతున్న అంతర్గత పోరులో చివరకు ఎవరి వ్యూహం ఫలిస్తుందన్నది ఉత్కంఠంగా మారింది. మాజీ వైస్ చైర్మన్ వర్గం తమకు అనుకూలంగా ఉన్న సభ్యులనుసమీకరించుకుంటుందా..? లేక మరో వర్గం తన బలాన్ని చాటుకుంటుందా అనే ప్రశ్నలు సొసైటీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల మధ్య మాజీ వైస్ చైర్మన్ తదుపరి అడుగు ఏంటన్నది కూడా చర్చనీయాంశంగా మారింది.

**రైతుల ప్రయోజనాలే కీలకం**

సొసైటీ చైర్మన్ పదవిపై రాజకీయ పోటీ ఎలా ఉన్నప్పటికీ పిఏసిఎస్ పరిధిలోని రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఇతర సహకార సేవలు సక్రమంగా అందించడమే ప్రధాన అంశమని రైతులు పేర్కొంటున్నారు. పాలకవర్గంలో ఏర్పడే కొత్త సమీకరణాలు సొసైటీ కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాల్సి ఉంది. ప్రస్తుతం వైస్ చైర్మన్ రాజీనామాతో మొదలైన పరిణామాలు ఎటువైపు దారితీస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఇరు వర్గాల మధ్య సాగుతున్న ప్రయత్నాల్లో ఎవరి పంతం నెగ్గుతుంది...ఎవరు వెనక్కి తగ్గుతారు చివరకు చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుంది అన్నది సొసైటీ వర్గాల్లో ఉత్కంఠ రేపుతుంది.




# ఆత్మవిశ్వాసం, పట్టుదలతో
# విజయాలు సాధించాలి



దివ్యాంగులకు పరికరాలను అందజేస్తున్న ఎంపి

**షాద్‌నగర్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** షాద్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మహిళా శిశు సంక్షేమశాఖ, జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ ఆధ్వర్యంలో, అలింకో సహకారంతో సామాజిక అధికారిత శిబిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ లోక్‌సభ సభ్యురాలు డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఏడీఐపీ పథకం కింద అవసరమైన సహాయ పరికరాలు, ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. దివ్యాంగులను ఉద్దేశించి డీకే అరుణ మాట్లాడుతూ.. ప్రతిభకు వైకల్యం అడ్డంకి కాదని, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ఎన్నో విజయాలను సాధించవచ్చని అన్నారు. దివ్యాంగులలో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి అవసరమైన సహకారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీకే అరుణ తెలిపారు. అనంతరం దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేసి, వారికి సహాయ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పోషణ్ అభియాన్ పోస్టర్లను డీకే అరుణ ఆవిష్కరించారు. అంగన్ వాడీ ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన వివిధ పోషకాహార ప్రదర్శనశాలలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రదర్శనశాలలను సందర్శించిన డీకే అరుణ.. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార నమూనాలను పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శ్రీమతి ఉదయ, ఐసీడీఎస్ పర్యవేక్షకులు, అందే బాబయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, దివ్యాంగ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.




వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపి డికె అరుణ

# విద్యుత్ కోసం రోడ్డెక్కిన రైతులు

**దోమ, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మోత్కూర్ గ్రామ రైతులు తమ పంట పొలాలు ఎండి పోతున్నాయని ఆవేదన చెందున్నారు. వ్యవసాయ పొలాలకు మూడు పెస్‌ల విద్యుత్ సరఫరా సక్రమంగా రావడం లేదని వచ్చిన కరెంటు మాటికిమాటికి పోవడంతో పంటలు ఎండిపోతున్నాయని విసుగుచెందారు. ఈ విషయంపై గురువారం నాడు మోత్కూర్ గ్రామము నుండి గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పర్గి మహబూబ్‌నగర్ మెన్ రోడ్డుపై దర్నా చేశారు. రోడ్డుపై రైతులు ధర్నా చేయడంతో కొంతసేపు రాకపోకలు నిలిచి పోయాయి. మూడుపెస్‌ల విద్యుత్ సక్రమంగా అందించాలనిడిమాండ్ చేస్తు కాంగ్రెస్ డౌన్ అంటు నినాదాలు చేశారు. 24 గంటల కరెంటుకు కనీసం 8 గంటలుకూడ రావడం లేదని వచ్చిన ఎనిమిది గంటలు సక్రమంగా అందడం లేదని అన్నారు. రైతులు రోడ్డుపై ధర్నా చేయడంతో దోమ ఎస్ఐ వసంత్ పోలిసులతో వచ్చి ధర్నా విరమింప చేయాలని తెలుపగారైతులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. విద్యుత్ అధికారులు వచ్చి హామి ఇచ్చేంత వరకు ధర్నా విరమించమని పట్టుపట్టి ఎండలోనే ధర్నా చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

# పటేల్ పోలీసు చర్యతోనే తెలంగాణాకు విముక్తి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం పొందినా, హైదరాబాద్ సంస్థానం నిజాం ఉస్మాన్‌అలీఖాన్ పాలనలో మరో 13 నెలలు బానిసత్వంలో కొనసాగిందని డివిజన్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ అంబేద్కర్ విగ్రహం ఆవరణలో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం పాలనలో రజాకార్లు ప్రజలపై అత్యాచారాలు, హింసలు చేస్తూ పీడించారని, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేతృత్వంలో భారత ప్రభుత్వం ఆపరేషన్ పోలో (పోలీస్ యాక్షన్) ప్రకటించిందని తెలిపారు. 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం హైదరాబాద్‌లోకి ప్రవేశించిన నాలుగు రోజుల్లోనే నిజాం లొంగిపోగా సెప్టెంబర్ 17న అధికారికంగా లొంగిపోతున్నట్లు ప్రకటించడంతో హైదరాబాద్ భారత్‌లో విలీనమైందని గుర్తు చేశారు. ఈపోరాటంలో వేలాదిమంది తెలంగాణ ప్రజలు ప్రాణత్యాగం చేశారని రావి నారాయణరెడ్డి, మల్లు స్వరాజ్యం, చంద్రరాజేశ్వరరావు, షోయాబుల్లా ఖాన్ వంటి నాయకులు ఈస్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించారని తెలంగాణ ప్రజలకు విమోచన దినంగా, భారతీయులకు సమైక్యతా దినంగా పరిగణిస్తున్నారని తెలిపారు. ఈసందర్భంగా తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, కంభం లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు గుండ్ల రామతీర్థ, పడిగం వీరేశం, కార్యదర్శి మద్దోజు సిద్దిరాజు, మహిళా మోర్చా నాయకురాలు కొన్నె మాధవి, బూత్ అధ్యక్షులు నర్సింహా రెడ్డి, మమతా శర్మ, మోటే మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# గాడు బావి ఇక బతుకమ్మ ఘాట్‌గా..

**శంషాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** గ్రామభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. శంషాబాద్ మండలం నర్కుడలో గ్రామ చారిత్రక గుర్తింపుగా ఉన్న అతి పురాతన గాడు బావిని బతుకమ్మ ఘాట్‌గా పునరుద్ధరించేందుకు గురువారం గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గాడు బావిని అభివృద్ధి చేసి బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు, గ్రామ ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా అందమైన బతుకమ్మ ఘాట్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు చారిత్రక ప్రదేశాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరటి మహేష్, వార్డు సభ్యులు చౌట రాజు, కనకమామిడి విష్ణు, బుర్కుంట నాగరాజు, పర్వతం వినోద్, కాంగ్రెస్ నాయకులు తొంట అశోక్, గూడెపు లక్ష్మణ్, పులిమామిడి శ్రీకాంత్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రూ.3.30 కోట్లతో రోడ్డు పనులకు శ్రీకారం

**- ఇంద్రనగర్ దొడ్డి-కవ్వగూడ మధ్య మెరుగుపడనున్న రవాణా సౌకర్యాలు - పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**శంషాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రోడ్డు కష్టాలకు చెక్ పెట్టెందుకు రూ.3.30 కోట్లతో పనులు చేపడుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం శంషాబాద్ పరిధిలో మరో కీలక రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇంద్రనగర్ దొడ్డి నుంచి కవ్వగూడ వరకు నూతనంగా నిర్మించనున్న పీడబ్ల్యూడీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... హెచ్ఎండీఏ నిధులు రూ.330 లక్షలతో చేపట్టనున్న ఈ రహదారి నిర్మాణంతో స్థానిక ప్రజల రవాణా కష్టాలు తొలగనున్నాయని అన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే ఇంద్రనగర్ దొడ్డి, కవ్వగూడతో పాటు పరిసర ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని రహదారి నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



స్మార్టు కార్డులు అందజేస్తున్న కౌన్సిలర్ మొక్తాల వెంకటయ్య

## స్మార్ట్ రేషన్ కార్డ్‌ల పంపిణీ

**ఆమనగల్లు, సెప్టెంబరు17, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని 4వ ప్రభుత్వ చౌకధర దుకాణంలో గురువారం రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం సమకూర్చిన నూతన స్మార్ట్ కార్డులను పంపిణీని చేపట్టారు. స్థానిక కౌన్సిలర్ మొక్తాల వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్డుల పంపిణిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మొక్తాల మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు చౌక ధర దుకాణాల వినియోగాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసౌకర్యం కల్గకుండా ప్రజలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో డీలర్ బికుమాండ్ల కృష్ణయ్య, రేషన్ కార్డుదారులు తదితరులు ఉన్నారు.



కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త, చిత్రంలో సర్పంచు శ్రీనునాయక్

## కెసిఆర్ హయాంలోనే గిరిజన తండాల అభివృద్ధి

**ఆమనగల్లు, సెప్టెంబరు17, ప్రభాతవార్త:** పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం సుస్థిర పాలనతో సుభిక్షంగా వర్ధిల్లిందని ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. పట్టణాలతోపాటు వెనుక బడిన మారుమూల గ్రామాలు, తండాలు శరవేగంగా అభివృద్ధి సాధించాయని ఆయన తెలిపారు. గురువారం మండల పరిధిలోని రాంనుంతల గ్రామపంచాయతీలో చైర్మన్ పర్యటించారు. ఆగ్రామ సర్పంచు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో గిరిజనులతో కలిసి గతప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. రైతులతో కలిసి మాట్లాడి పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ చిత్రపటానికి ఆ గ్రామ సర్పంచ్ వద్యావత్ శ్రీనునాయక్‌తో కలిసి వెంకటేష్‌గుప్తా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో గిరిజన తండాలు ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా తీర్చి దిద్దడంతో స్వయంపాలనలో ఎంతోప్రగతిని సాధించాయని కొనియాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాంతాల వెనుకబాటుతనానికి కారణమవుతుందని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు 10 రిజర్వేషన్లు అమలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వద్యావత్ శ్రీను నాయక్, ఉప సర్పంచ్ రాజేశ్వరిమోహన్, వార్డు సభ్యులు పాత్లావత్ ధనరాజ్, శంకర్ నాయక్, కృష్ణ నాయక్, బిఆర్ఎస్ అధ్యక్షుడు గడియ శేఖర్, బిఆర్ఎస్ నాయకులు రూప్సింగ్ నాయక్, కృష్ణ నాయక్, నరేందర్ నాయక్, రాజేందర్, శాంతిలాల్, హమ్లా నాయక్ నరీ పాల్గొన్నారు.



నాగారం డివిజన్ కార్యాలయంలో బిఎల్ఓ,బిఎల్ఏల సమావేశంలో మాట్లాడుతున్న డిసి వాణిరెడ్డి

## ఎస్ఐఆర్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలి

**కీసర, సెప్టెంబరు17, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ వాణిరెడ్డి అన్నారు. గురువారం నాగారం డివిజన్ కార్యాలయంలో బిఎల్ఓల ద్వారా నోటీసుల పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు అందించాల్సిన నోటీసులను సకాలంలో క్రమబద్ధంగా, ప్రతి సంబంధిత వ్యక్తికి చేరే విదంగా పంపిణీ చేయాలని బిఎల్ఓలకు సూచించారు. ప్రతి బిఎల్ఓ తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ పరిధిలోని నోటీసుల పంపిణీ పూర్తి చేసి నోటీసు అంద జేసిన వివరాలు స్వీకరణ, సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. నోటీసు అందుబాటులో లేని వ్యక్తులకు సంబంధించి నిబంధనల ప్రకారం అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని, పంపిణీ ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని బిఎల్ఓలు సమన్వయంతో పనిచేసి నోటీసుల పంపిణీ పురోగతిని సంబంధిత అధికారులకు నివేదించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ, బిఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

## పోలేపల్లిలో నూతన సిసి రోడ్డు ప్రారంభం

**దుద్యాల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ జింకల చంద్రయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కడ వెంకటరెడ్డికి సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనురాధ, కార్యదర్శి ఆలమయ్య, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జయరాములు, ప్రధాన కార్యదర్శి మంగలి రాములు, రేవంత్ సైన్యం అధ్యక్షుడు నరసింహ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణగౌడ్, ఉపాధ్యక్షులు బాలు, రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేడియల్ రోడ్డుకు నష్టపరిహారం చెక్కుల పంపిణీ

**దుద్యాల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామంలో రేడియల్ రోడ్ నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులకు గురువారం నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 61 మంది రైతులకు రూ.6,76,20,000 పరిహారం అందజేశారు. కార్యక్రమంలో జీపీఓ రమేష్, నాయకులు వెంకటరెడ్డి, వెంకటయ్య, బ్యాగరి నరసింహ, నర్సింహ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివిలో అతిథి ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**మొయినాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** విద్యార్థులకు విద్యాబోధన చేయడానికి అతిథి అధ్యాపకులు, ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి హరిష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఖాసింభౌలి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన నజీబ్ నగర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు సాంఘిక శాస్త్రంలో విద్యాబోధన చేయడానికి కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ ( అతిథి ఉపాధ్యాయులుగా) గా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు డిగ్రీతో పాటు బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎంపికైన అభ్యర్థులకు నెలసరి వేతనం రు. 18 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

# కమ్యూనిష్టులే తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వారసులు

సిపిఎం జిల్లా కార్యదర్శి మహిపాల్

**కొడంగల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** కమ్యూనిష్టులే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ అన్నారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ అద్వర్యంలో గురువారం కొడంగల్ పట్టణంలో సెప్టెంబర్ 17 తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విలీన ముగింపు సభ వెంకటయ్య అధ్యక్షత వహించగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ హాజరైన ఆయన మాట్లాడారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం మత చరిత్ర కాదని వర్గ పోరాట చరిత్ర అన్నారు. మతోన్మాదులకు అణువంత సంభంధం లేదని, పటేల్ సైన్యం నిజాం రజాకార్ గుండాలు భూస్వాములు అణిచివేసిందని మన మట్టి మనుషులనే



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కారయదర్శి మహిపాల్

అన్నారు. భారతదేశ వ్యాప్తంగా తెలంగానా రైతాంగ పోరాటాన్ని వక్రీకరించే కుట్ర జరుగుతుందని, ఇది హిందువులకు ముస్లీంలకు మద్య జరిగిన గొడవ అని మతోన్మాదులు అబద్దపు ప్రచారాన్ని చేస్తున్నారని, నిజంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మత పోరాటం కాదని వర్గ పోరాటమని అన్నారు. ఈ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని మతోన్మాదులకు అనువంత సంభంధం లేదని అన్నారు. భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం అంటరానితనం కులవివక్ష దోపిడికి వ్యతిరేకంగా జరిగిన మహోజ్వల పోరాటమే తెలంగానా రైతు సంఘం పోరాటం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుంటి వెంకటయ్య, నిరంజన్, వెంకటయ్య, బాస్కర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, చంద్రయ్య, శ్రీనివాస్, బుగ్గప్ప, నర్సమ్మ, మంగమ్మ, అనసూయ, లక్ష్మీ, మల్కయ్య, ఒక్రామిరెడ్డి, సత్తయ్య, రవినాయక్, శరణప్ప, రాముడా యక్, లక్ష్మయ్య, తేజ, అనిల్, రాజు పాల్గొన్నా రు.

## నిజాం అరాచక పాలనకు చరమగీతం పాడిన సెప్టెంబర్ 17

**మొయినాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** తెలంగాణ విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని మొయినాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ షాబాద్ సోనియా దర్శన్ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సోనియా దర్శన్ మాట్లాడుతూ నిజాం పాలన కాలంలో తెలంగాణ ప్రజలు అనేక ఇబ్బందులు, అణచివేతలను ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం అనేక మంది పోరాటాలు చేశారని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిందని తెలిపారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సమానత్వం వంటి విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయటానికి కృషి

**శామీర్‌పేట, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయటానికి వార్డులలో కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ఉండి పనిచేయాలని ఆయన సూచించారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు, వార్డులలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయటం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు పార్టీ నాయకులు వివరించాలని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రేషన్‌కార్డులు, రైతుభరోసా, రైతు రుణమాఫీ, ఉచిత గ్యాస్, మహిళా సంక్షేమం, ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, బిసి, మైనార్టీ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించటం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి రావటమే లక్ష్యంగా నాయకులు పని చేయాలని వెంకటేశం సూచించారు. మున్సిపాల్టీ అభివృద్ధికి కోసం ప్రభుత్వం నుంచి డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ సహకారంతో నిధుల మంజూరు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్‌లోని 24వార్డులలో వార్డు కాంగ్రెస్ కమి టీలను ఏర్పాటు చేసి నాయకులను, కార్యకర్తలను భాగ స్వాములను చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమా వేశంలో మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్, మున్సిపల్ కమిటీ ప్రధాన కార్యదర్శి బండి జగన్నాధం, నాయకులు శశిధర్‌రెడ్డి, బాలకృష్ణ, చెవ్వ రవీందర్, భస్వారెడ్డి, వీరేశంగుప్తా, వీరారెడ్డి, ఎండి జాఫర్, నర్సింగ్‌రావుగౌడ్, కీసర నర్సింలు, ప్రవీణ్, బుచ్చిరెడ్డి, భూపాల్‌రెడ్డి, సదానందం, నాగేశ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీకాంత్‌నాయక్, ఎండి యూసుఫ్, బి.సదానందం, దామోధర్‌రెడ్డి, కరుణాకర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17 విమోచనము కానే కాదు

బుద్ధుల జంగయ్య..



**షాద్‌నగర్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** సెప్టెంబర్ 17 విమోచనం కానే కాదని సిపిఐ నాయకుడు బుద్ధుల జంగయ్య అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోచాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే బహిరంగ సభకు బుద్ధుల జంగయ్య ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్ధుల జంగయ్య మాట్లాడుతూ తెలంగాణ లో జమీందారులకు జాకీర్దాలకు వ్యతిరేకంగా చిన్న కారు చిన్న కారు కౌలు రైతులు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో చేసిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని ఆయన వివరించారు రావి నారాయణరెడ్డి బద్దం ఎల్లారెడ్డి మగ్గం మొయినాదీన్ షేక్ బందగి నూరు ఖాన్ పుచ్చలపల్లి సుందరయ్య తదితరులు అనేకులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నవారు ఆ పోరాటంలో అనేక రకమైన ప్రజాసంఘాల నాయకులు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు 4500 మందిఆసువులు బాచారు ఆ పోరాట ఫలితంగానే జాగిర్దాలు జమీందారులు గ్రామాలను వదిలేసి పట్టణ బాట పట్టిన పరిస్థితి 3000 గ్రామాలకు విముక్తి చేసి పది లక్షల ఎకరాలను పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ సిపిఐదని ఆయన తెలియజేశారుసర్దార్ వల్లభాయ్ పటేల్ హోం మంత్రిగా ఉన్నప్పుడు భారత సైన్యంతో తెలంగాణపై దండెత్తి వచ్చి తెలంగాణ నవాబు సైన్యంపై పోరాటం చేయలేదు కమ్యూనిస్టు సాయి దళాలు విమిక్తు చేసిన గ్రామాలకు రక్షణగా ఉంటే వారిపై పోరాటం చేసి వారిని కాల్చి చంపి తిరిగి జాగిందాలకు జమీందారులకు గ్రామాల్లో ఉన్న భూములన్ని అప్పజెప్పడం జరిగింది అధికారాలను అప్పజెప్పడం జరిగింది తెలంగాణ నవాబును రాజభరణాలతో పాటు గవర్నర్ పదవి ఇచ్చి లోపై కారి ఒప్పందం ప్రకారం తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేసుకోవడం జరిగింది అని తెలిపారు చరిత్ర చెరిగిపోదు చరిత్ర పుటల్లో నిలిచిపోయే చరిత్ర తెలంగాణ ది భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమే రుజువు ఇలాంటి చరిత్ర కలిగిన సెప్టెంబర్ 17ను విమోచనమని వీలీనమని అనేక రకమైన పుక్కిటి పురాణాలు రచించి చరిత్రను వక్రీకరిస్తున్న మతోన్మాద నాయకులు పార్టీలు చరిత్ర తెలుసుకొని మాట్లాడాలనిఆయన ఇతవు పలికారు నేటి సమాజంలో తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర తెలంగాణ యువతరానికి తెలియాల్సిన అవసరం ఉందని దాన్ని పాటాంశాలలో కూడా చేర్చాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ కొందుర్గు మండల కార్యదర్శి భాగాళ నరసింహ జిల్లేడు చౌదరిగుట్ట మండల సహాయ కార్యదర్శి ఎం డి షబ్బీర్ నాయకులు ఈదమ్మ జంగయ్య జి యాదయ్య శ్రీను సి సురేష్ బి యాదయ్య పామిడి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల సాగులో సేంద్రీయ పద్ధతులు పాటించాలి

..ఉద్దెమర్రి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించిన

..ఎస్‌కెఎల్‌టిజి హార్టికల్చర్ యూనివర్సిటీకి చెందిన సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జె.శ్రీనివాస్

**శామీర్‌పేట, సెప్టెంబరు 17, ప్రభాతవార్త** రైతులు కూరగాయ సాగులో సేంద్రీయ పద్ధతులు పాటించాలని ఉద్యానవన, వ్యవసాయశాఖల అధికారులు అవగాహన కల్పించారు. గురువారం మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రి గ్రామంలో రైతులకు పంటల సాగుకు సేంద్రీయ ఎరువుల వాడే పద్ధతిపై సంబంధిత శాఖల అధికారులు అవగాహన కల్పించారు. కూరగాయల పరిశోధన కేంద్రం ఎస్‌కెఎల్‌టిజి హార్టికల్చర్ యూనివర్సిటీకి చెందిన సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జె.శ్రీనివాస్ రైతులకు పలు సూచనలు చేశారు. కూరగాయల సాగులో అధిక దిగుబడుల కోసం విచక్షణ రహితంగ రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండ నేల స్వభావాన్ని బట్టి కాపాడే సేంద్రీయ పద్దతులను ప్రోత్సహించాలని సూచించారు. సేంద్రీయ ఎరువులు, జీవ ఎరువులు, సహజ పద్ధతిలో పురుగుల నివారణ, పంటల మార్పిడి, నేల ఆరోగ్యపరిరక్షణ వంటి అంశాలపై రైతులకు ఆయన వివరించారు. సేంద్రీయ ఎరువుల పద్ధతితో సాగు చేయటం వల్ల నేల సారవంతతను కాపాడటంతో పాటు పంటల నాణ్యత మెరుగుపడుతుందన్నారు. సాగు ఖర్చులను కూడ నియంత్రించుకునే అవకాశం ఉంటుందన్నారు. పంటల సాగు విషయంలో వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు డి.లత, పి.శ్రీలత, లత, ప్రోగ్రెసీవ్ రైతు ప్రసాద్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు. దీనిలో ఉద్యానవన శాఖ అధికారులు స్వప్నిక, వెంకట్‌రమణ, వ్యవసాయ అధికారి ప్రవీణ, ఏఈఓ సురేష్, హెచ్ఇఓ సంధ్య, ఎఫ్‌పిఓ అధ్యక్షులు సీతారామరావు, మట్టి శాస్త్రవేత్త స్పిక్ మేనేజర్ హుస్సేన్, పలువురు రైతులు పాల్గొన్నారు.



ఉద్దెమర్రి గ్రామంలో రైతులకు కూరగాయ సాగులో సేంద్రీయ పద్ధతిని పాటించేందుకు అవగాహన కల్పించిన ఉద్యానవన సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్న కౌన్సిలర్లు, ఉద్యానవన,వ్యవసాయ శాఖల అధికారులు,రైతుల దృశ్యం



విశ్వకర్మ పూజలో పాల్గొన్న మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, మాజీ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి

## ఘనంగా విశ్వకర్మ జయంతి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ బాలాజీనగర్‌లోని విశ్వకర్మ మన్మయ సంఘంలో గురువారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేసిన పలువురు దంపతులు హోమంలో పాల్గొన్నారు. సందర్భంగా యజ్ఞ కార్యక్రమం టీం బ్రదర్స్ యూత్ సభ్యులు నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డిలు విచ్చేసి అన్నప్రసాదం అందించారు. ఈసందర్భంగా మన్మయ సంఘం నాయకులు విచ్చేసన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులను శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మేకల నర్సింగ్‌రావు, మాజీ కౌన్సిలర్ బండారి ఆంజనేయులుగౌడ్, విశ్వకర్మ సంఘం సభ్యులు దేవరకొండ పద్మ రాజాచారి, పవన్ కుమార్‌చారి, నాగభూషణంచారి, కర్ణ కంటి రాజు, చంద్రయ్య, ఉపేంద్రచారి, నాయకులు బచ్చు నగేష్ కుమార్‌గుప్తా, అబ్బగోని నాగరాజుగౌడ్, లక్ష్మయ్య, రాజేష్‌గౌడ్, సారా శ్రీనివాస్‌గౌడ్, మురళి గౌడ్, ఎండి.సిరాజ్, నవీన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు



ఘట్‌కేసర్‌లో జాతీయజెండావిష్కరణ చేసి మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

## పటేల్ పోలీసు చర్యతోనే తెలంగాణాకు విముక్తి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం పొందినా, హైదరాబాద్ సంస్థానం నిజాం ఉస్మాన్‌అలీఖాన్ పాలనలో మరో 13 నెలలు బానిసత్వంలో కొనసాగిందని డివిజన్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ అంబేద్కర్ విగ్రహం ఆవరణలో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం పాలనలో రజాకార్లు ప్రజలపై అత్యాచారాలు, హింసలు చేస్తూ పీడించారని, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేతృత్వంలో భారత ప్రభుత్వం ఆపరేషన్ పోలో (పోలీస్ యాక్షన్) ప్రకటించిందని తెలిపారు. 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం హైదరాబాద్‌లోకి ప్రవేశించిన నాలుగు రోజుల్లోనే నిజాం లొంగిపోగా సెప్టెంబర్ 17న అధికారికంగా లొంగిపోతున్నట్లు ప్రకటించడంతో హైదరాబాద్ భారత్‌లో విలీనమైందని గుర్తు చేశారు. ఈపోరాటంలో వేలాదిమంది తెలంగాణ ప్రజలు ప్రాణత్యాగం చేశారని రావి నారాయణరెడ్డి, మల్లు స్వరాజ్యం, చంద్రరాజేశ్వరరావు, షోయాబుల్లా ఖాన్ వంటి నాయకులు ఈస్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించారని తెలంగాణ ప్రజలకు విమోచన దినంగా, భారతీయులకు సమైక్యతా దినంగా పరిగణిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, బూత్ అధ్యక్షులు నర్సింహా రెడ్డి, మమతా శర్మ, మోటే మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## రేపే మండల సర్వసభ్య సమావేశం

ఎంపిడిఓ సృజన సాహిత్య

**మోమిన్‌పేట్, సెప్టెంబరు 17. ప్రభాతవార్త:** రేపు అనగా 19,09,26. శనివారం ఉదయం 10,30, గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వ సాధారణ సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ సృజన సాహిత్య ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతు యధావిధిగా మండల ప్రత్యేకాధాకారి అధ్యక్షతన నిర్వహించే ఈ మండల సర్వసభ్య సమావేశానికి సమస్త మండలంలోని ప్రతి గ్రామ పంచాయతి సర్పంచులు, సంభందిత మండల, జిల్లాకు సంభందించి అన్ని శాఖల అధికారులు సమయపాలన పాటించి ఈ సర్వ సభ్యసమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ సృజన సాహిత్య కోరారు.

## రైతు వేదికలో ఆర్పీఎల్ శిక్షణ ముగింపు

**దుద్యాల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** దుద్యాల్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల ఆర్పీఎల్ శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. వరి మేలైన, సన్న రకాల ఎంపిక, అంతర పంటల సాగు, భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల వినియోగం, నానో యూరియా, నానో డీఏపీ, ప్రకృతి వ్యవసాయం, జీవ ఎరువులు, సమగ్ర సస్యరక్షణ, నూనెగింజల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వరి, కంది పంటలపై క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగీత, ఎంపీడీవో జైపాల్‌రెడ్డి, సంతోష్, కావ్య, బాబు, ఉద్యాన అధికారి బబ్యా నాయక్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి సర్పంచ్ డివై నర్సిములు

**పెద్దేముల్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సర్పంచ్ డివై నరసింహులు అన్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ (బాలుర) లో అంది స్తున్న భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతతో పాటు వంట గది పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డివై నరసింహులు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నిర్దే శించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో పరిశుభ్రతకు అత్యంతప్రాధాన్యత ఇవ్వాలని తాగునీరు వంటపాత్రలు వంట గది పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులు ఇష్టంతోపాటు కష్టపడిచదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షి ంచారు. బియ్యం సక్రమంగా లేనందున అన్నం బాగా కావడం లేదని విద్యార్థులు సర్పంచ్ దృష్టికి తీసుకురాగా ఈ బియ్యంకు బదులు ఇతర బియ్యంను స్కూలుకు పంపేలా చూడాలని ఎంఈఓ నర్సింగ్ రావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎం సునీత ఉపా ధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**తలకొండపల్లి, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇస్రాయి పల్లి గ్రామానికి చెందిన రాసులపల్లి స్వప్నకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం నాడు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి అందజేశారు. రాసులపల్లి స్వప్న అనారోగ్యానికి గురి కావడంతో కార్పొరేట్ ఆసుపత్రిలో ఆసుపత్రిలో చికిత్స నిర్వహించుకున్నారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ గోల్డ్ శ్రీనివాసరెడ్డి సహకారంతో 25వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంజూరు చేయించి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి , కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ గౌడ్ కౌన్సిలర్ సురేష్ నాయక్ మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

## గోల్కొండ కోటపై రాజ్యాధికారం సాధించే వరకు పోరాటం ఆగదు

తీన్మార్ మల్లన్న



పాదయాత్రలో పాల్గొన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ షాద్ నగర్ నాయకులు

**షాద్‌నగర్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని గోల్కొండ కోట నుంచి తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో ప్రారంభమైన మహా పాదయాత్రలో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్మె సంతోష్ ఆధ్వర్యంలో నాయకులు పాదయాత్రలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. గోల్కొండ కోటపై రాజ్యాధికారం సాధించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో తగిన ప్రాతినిధ్యం దక్కాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు వైశ్యులు, బ్రాహ్మణులు తదితర వర్గాలకు కూడా రాజ్యాధికారంలో తగిన ప్రాతినిధ్యం, న్యాయం కల్పించాల్సిన అవసరం ఉందని తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. అన్ని వర్గాల భాగస్వామ్యంతోనే సమగ్ర సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. ఈ మహా పాదయాత్రలో షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్మె సంతోష్, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి భూస జంగన్న, కొందుర్గు మండల అధ్యక్షులు దర్గా వెంకటయ్య, చౌదర్‌గూడ మండల అధ్యక్షులు డి. రాములు, నియోజకవర్గ నాయకులు మహేష్, ఎల్ల రాజు, యాదయ్య, నర్సింహులు, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఆర్‌పిఎఫ్ పబ్లిక్ స్కూల్‌లో బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్

**జవహర్‌నగర్, సెప్టెంబర్17 ప్రభాతవార్త:** జవహర్ నగర్‌లోని సిఆర్‌పీఎఫ్ పబ్లిక్ స్కూల్‌లో బోయింగ్ సుకన్య స్టెమ్ ల్యాబ్‌ను సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జి.పి.సింగ్ గురువారం ప్రారంభించారు. బోయింగ్ ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు సలీల్ గుప్తే సమక్షంలో కార్యక్రమం జరిగింది. విద్యార్థుల్లో, ముఖ్యంగా బాలికల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ ,గణితంపై ఆసక్తి, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యలను పెంపొందించడమే ల్యాబ్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఆరోతరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ప్రయోగాలు, ప్రాజెక్టుల ద్వారా ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా డీజీ సిఆర్‌పీఎఫ్ ల్యాబ్‌ను సందర్శించి విద్యార్థులను అభినందించి సైన్స్, టెక్నాలజీ రంగాల్లో మరింత రాణించాలని సూచిం చారు. కార్యక్రమంలో ఐజీ టి.విక్రమ్, డిఐపి డా.బి.వీర్రాజు ,బోయింగ్ ప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపాల్ డి.అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతి వెళ్తుతుండగా ఘట్‌కేసర్ –బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి ఎంపీ24ఎన్–9936 నెంబర్ గల ఫ్యాషన్ ప్లస్ మోటార్ సైకిల్ పై కూర్చొని కాళ్లతో నెట్టుకుంటూ రైలు పట్టాల మధ్యనుండి బీబీనగర్ వైపు వెళుతుండగా వెనుక నుండి వేగంగా వస్తున్న వందే భారత్ రైలు ఢీకొట్టింది. దీంతో 99 స్లీపర్ల దూరం ఈడ్చుకు వెళ్లిన తర్వాత ఎగిరి రైలు పట్టాల పక్కన పడగా తలపగిలి, శరీరమంతా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు.

# సేంద్రీయ సాగుతో నేల ఆరోగ్యం..

**రైతులకు మెరుగైన ఆదాయం**

**షాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకుని రైతులు మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చని సేంద్రీయ వ్యవసాయ నిపుణులు జి. శ్రీకాంత్ అన్నారు. గురువారం షాబాద్ మండలం ముద్దెంగూడ గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ సహకారంతో జనవికాస్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సాగు ఖర్చులను తగ్గించుకునేందుకు మల్టీ లేయర్ క్రాపింగ్, కూరగాయల సాగు, వరి–చేపల సమీకృత సాగు, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ వంటి పద్ధతులను అవలంబించాలని సూచించారు. సంస్థ సీఈఓ పి. సంపత్‌కుమార్ మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షలు, కిచెన్ గార్డెన్లు, జీవ ఎరువులు, బయో కంట్రోల్ ఏజెంట్లు, మిశ్రమ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆరు నెలల డెమోన్స్ట్రేషన్ మోడల్స్, బయో రిసోర్స్ సెంటర్లు, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ వంటి స్థిరమైన జీవనోపాధి మార్గాలను వివరించారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా నేల సారాన్ని, నేలలో సేంద్రీయ కార్బన్‌ను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే సేంద్రీయ ధ్రువీకరణ ప్రక్రియ, సేంద్రీయ ఉత్పత్తులకు భవిష్యత్తులో మార్కెటింగ్ అవకాశాలు, ఎగుమతులు, మెరుగైన ధరలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓ) ద్వారా మార్కెటింగ్ అంశాలను వివరించారు. వెల్‌స్పన్ ఫౌండేషన్ సహకారంతో రైతులకు మార్కెట్ అనుసంధానం కల్పించి సేంద్రీయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహులు, ఉపసర్పంచ్ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, రైతులు లింగం, వెంకటయ్య, డెమో యూనిట్ రైతు గోపాల్, సంస్థ ప్రతినిధులు, ఇతర రైతులు పాల్గొన్నారు.



ముద్దెంగూడలో రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సేంద్రీయ వ్యవసాయ నిపుణులు

## వేదగిరిగుట్టపై మొక్కలు నాటిన ఎంపిడిఓ

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్ శ్రీ వేదగిరిగుట్టపై గురువారం ఎంపిడిఓ పుష్పలత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయితీ సిబ్బం దిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ హాన్మంత్‌రెడ్డి, తది తరులు ఉన్నారు.


గ్రామ పంచాయితీ సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపిడిఓ పుష్పలత

# సిఎం ఇలాకాలో రాజకీయ వేడి..

**-తెలంగాణ రక్షణ సేనలోకి రాజప్రభాకర్ చేరికతో కొడంగల్ నియోజకవర్గంలో బలపడుతున్న పార్టీ-ఈ నెల 20న కోస్గిలో**
**-- "పాంచజన్య సంకల్ప సభ" నిర్వహణ-ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు**

**దౌల్తాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ముఖ్యమంత్రి ఇలాకాలో "పాంచజన్య సంకల్ప సభ" నిర్వహిస్తుండడంతో రాజకీయ ఉత్కంఠ నెలకొంది. మరోవైపు స్థానిక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలానికి చెందిన బిజెపి నియోజకవర్గ యువ నాయకులు రాజప్రభాకర్ తన అనుచరులతో కలిసి "తెలంగాణ రక్షణ సేన" పార్టీలో చేరడంతో కొడంగల్ నియోజకవర్గంలో ఆ పార్టీకి మరింత పట్టు వచ్చిందని, కేడర్‌లో కొత్త జోష్ కనిపిస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చేరికలతో నియోజకవర్గంలో పార్టీ బలం మరింత పుంజుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

ఈ పరిణామాల నడుమ ఈ నెల 20వ తేదీన కోస్గి వేదికగా తలపెట్టిన "పాంచజన్య సంకల్పసభ" రాజకీయంగా మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో పార్టీ బలపడుతుండటం, యువ నాయకత్వం క్రియాశీలకం కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సభ వేదికగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవితతో పాటు ఇతర నాయకులు ఎలాంటి రాజకీయ సందేశాలు ఇస్తారు? కొడంగల్ గడ్డపై రాబోయే రోజుల్లో రాజకీయం ఏ మలుపు తిరుగుతుంది? అనే అంశాలు ప్రస్తుతం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.

## రైతులకు మెరుగైన ఆదాయం

**షాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడు కుని రైతులు మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చని సేంద్రీయ వ్యవసాయ నిపుణులు జి. శ్రీకాంత్ అన్నారు. గురువారం షాబాద్ మండ లం ముద్దెంగూడ గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ సహకారంతో జనవికాస్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సాగు ఖర్చులను తగ్గించుకునేందుకు మల్టీ లేయర్ క్రాపింగ్, కూరగాయల సాగు, వరి–చేపల సమీకృత సాగు, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ వంటి పద్ధతులను అవలంబించాలని సూచించారు. సంస్థ సీఈఓ పి. సంపత్‌కుమార్ మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షలు, కిచెన్ గార్డెన్లు, జీవ ఎరువులు, బయో కంట్రోల్ ఏజెంట్లు, మిశ్రమ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆరు నెలల డెమోన్స్ట్రేషన్ మోడల్స్, బయో రిసోర్స్ సెంటర్లు, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ వంటి స్థిరమైన జీవనోపాధి మార్గాలను వివరించారు. సేంద్రీయ పద్ధతుల ద్వారా నేల సారాన్ని, నేలలో సేంద్రీయ కార్బన్‌ను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

# రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

**పూడూరులో ..**

**పూడూరు, సెప్టెంబరు 17, ప్రభాతవార్త ;** పూడూరు మండలంలో గురువారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో ప్రత్యేకఅధికారిణి జయసుధ, తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు విజయ్‌కుమార్, పిఏసిఎస్‌లో చైర్మన్ రఘునాథ్‌రెడ్డిలు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఓ పాండు, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు, మహిళా, యువజన సంఘాలు తదితరులు పాల్గొన్నారు.


పూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న ప్రత్యేక అధికారిని జయసుధ, ఎంపిడిఓ పాండు తదితరులు

**మార్కెట్‌యార్డు ఆవరణలో...**


మార్కెట్‌యార్డు ఆవరణలో జెండా ఎగురవేస్తున్న కమిటీ చైర్మన్ యాటగీతనర్సింహ్మ

**ఆమనగల్లు, సెప్టెంబరు 17, ప్రభాతవార్త ;** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసిన సందర్భంగా ప్రభుత్వ పిలుపుమేరకు గురువారం ఆమనగల్లు మండలంలో ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ప్రజాప్రతి నిధులతో కలిసి జాతీయ పతాకాలను ఎగురవేశారు. అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి వందనం సమర్పించారు. అధికారులతో పాటు, ప్రజా ప్రతినిధులు ఇతర వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రజాపాలన తీరును ప్రసంగించారు. మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్య నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ గీత నరసింహ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కందుకూరు మండలంలో..**

**కందుకూరు. అక్టోబరు 17, (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కందుకూరు మండలంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద సంబంధిత శాఖల అధికారులు మువ్వన్నెల జెండాలను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. కందుకూరు ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డిఓ జగదీశ్వర్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచరిక పాలనకు ముగింపు పలికి ప్రజాస్వామ్య పాలనకు సెప్టెంబర్ 17 1948లో బాటలు వేసుకున్నామని తెలిపారు. భారతదేశానికి 1947లో స్వాతంత్రం సిద్ధిస్తే నైజాం పాలనలో నుండి హైదరాబాదు రాష్ట్రానికి 1948లో స్వాతంత్రం సిద్ధించింది అన్నారు. ఆనాటి భారత ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ చొరవతో ఈ ప్రాంత ప్రజలకు ప్రజాస్వామ్య స్వేచ్ఛ లభించిందని తెలియజేశారు. నేటి పాలకులు ప్రజలకు మెరుగైన పాలన అందించడానికి ప్రజాపాలన కార్య క్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ గోపాల్, డిటి శేఖర్, ఆయా శాఖల ఉద్యోగులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## నిజాం నిరంకుశ పాలనకు చరమ గీతం

**చేవెళ్ల, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** నిజాం నిరంకుశ పాలనకు చరమ గీతం పాడిన రోజును ఘనంగా నిర్వహించుకోవాలని చేవెళ్ల మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని చేవెళ్ల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్క రించి, తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అత్తెల్లి అనంత్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా హైదరాబాద్ సంస్థానం నిజాంపాలనలో కొనసాగిం దని, లక్షలాది ప్రజలు నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ పోరాటం చేశారని అన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నాయకత్వంలో జరిగిన చర్యల అనంతరం హైదరాబాద్ సం స్థానం భారత యూనియన్‌లో విలీనమై, ప్రజలకు నిజాం పాలన నుంచి విముక్తి లభించిందని పేర్కొన్నారు. అలాంటి చారిత్రక తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కొన్ని వర్గాల ఓట్ల కోసం ఒకరు విలీన దినోత్సవం అని, మరొకరు ప్రజాపాలన పేరుతో నిర్వహిస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని అనంత్ రెడ్డి విమ ర్శించారు. తెలంగాణకు నిజమైన విముక్తి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన పాలన భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన రోజునే సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ వైభవ్ రెడ్డి, కౌన్సిలర్లు కరికే మీనాక్షి సత్యనారాయణ, అత్తిలి మనిషా అనంత రెడ్డి, పెద్దల దయాకర్, జనరల్ సెక్రెటరీ పత్తి సత్యనారాయణ, చేగూరి ప్రవీణ్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, జి శ్రీనివాస్ రెడ్డి, జి పురుషోత్తం రెడ్డి, చిర శ్రీనివాస్, ఏ రాజు, రమేష్, బీరప్ప, కర్ణాకర్, వడ్డే గణేష్, అశోక్, బి చంద్రశేఖర్ రెడ్డి, కే చంద్రశేఖర్ రెడ్డి, హర్షిత్, జై సింహా రెడ్డి గా, రాకేష్, జి మధుసూదన్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, శ్రీకాంత్, పి వెంకటేష్, సిహెచ్ నర సింహులు, చాకలి శ్రీనివాస్, తెలుగు శ్రీనివాస్, కె మహేందర్, నగేష్, నాగ రాజు, కృష్ణారెడ్డి, గోవర్ధన్, శ్రీతం రెడ్డి, మల్లేష్, అంజనేయులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**ప్రజలే పాలనకు కేంద్రబిందువు..**


చేవెళ్ల పురపాలక సంఘం కార్యాలయంలో జాతీయ జెండాను అవిష్కరించిన చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య

**చేవెళ్ల, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ప్రజలే పాలనకు కేంద్ర బిందువని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకుని చేవెళ్ల పురపాలక సంఘం కార్యాలయంలో జాతీయ జెండాను చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి అవిష్కరించారు. ఈ సందర్భంగా చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం రాష్ట్రచరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగినరోజని పేర్కొన్నారు. ప్రజా స్వామ్య విలువలను కాపాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే ప్రజాపాలన యొక్క ప్రధానలక్ష్యమని అన్నారు.

ప్రజలే పాలనకు కేంద్రబిందువులని, ప్రజా సంక్షేమమే లక్ష్యమని, తెలంగాణ అభివృద్ధే మనందరి బాధ్యత అన్నారు. చేవెళ్ల నియోజకవర్గంను రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలో ..**

**కోట్‌పల్లి, సెప్టెంబరు, 17 ప్రభాతవార్త;** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలో గురువారం నాడు తహశీల్దార్ కార్యాలయం ముందు తహశీల్దార్ అనంద్‌రావు, మండల పరిషత్ కార్యాలయం ముందు ఎంపీడీఓ హేమంత్, మండల ఆరోగ్య కేంద్రం ముందు మండల వైద్యాధికారి మేఘన, వివిధ పంచాయతీ కార్యాలయాల ముందు సర్పంచులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా తహశీల్దార్ అనంద్‌రావు మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కా రానికి చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అధికారులపై ఉందని వారు పేర్కొన్నారు ఈకార్యక్రమంలో ఎంపీడీఓ హేమంత్, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, ఆర్ఐ నరేష్, జీపీఓలు బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.


కోట్‌పల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు ప్రజాపాలన సందర్భంగా జాతీయజెండాను అవిష్కరిస్తున్న తహశీల్దార్ అనంద్‌రావు.

## ఆత్మగౌరవానికి ప్రతీక.. ప్రజాపాలన దినోత్సవం

**నందిగామ, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** నందిగామ మండలంలో తెలం గాణ విమోచన ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఊరురా.. వాడవాడలా జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. నందిగామ తహసిల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్వో సైదులు, ఎంపీడీవో కార్యాలయం, పిఏసిఎస్ వద్ద చైర్మన్ కుందారం వెంకట్ రెడ్డి, స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఇన్స్పెక్టర్ వీరబాబు, మేకగూడ పిఏసిఎస్ చైర్మన్ మంజుల రెడ్డి , చేగూరు పిఏసిఎస్ చైర్మన్ పసుల బుచ్చయ్యలు జాతయ పతకాలను ఎగురవేశారు. ఈ వేడుకలో అన్ని శాఖల అధికారులు, రాజకీయ ప్రముఖులు తదితరులు హాజరయ్యారు.


నందిగామ మండలం మేకగూడలో పిఏసిఎస్ కార్యాలయం ముందు జెండా ఎగురవేసిన చైర్మన్ మంజులారెడ్డి.

**మేడ్చల్ జాతీయ జెండా ఆవిష్కరణ బిజెపి నాయకులు**

**మేడ్చల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ హరినాథ్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందిన రోజు సెప్టెంబరు 17న తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా విమోచన దినోత్సవాని నిర్వహించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేసిన సర్దార్ పటేల్‌ను తెలంగాణ ప్రజలు మరువలేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా బిజెపి కోశాధికారి లవంగ శ్రీకాంత్, జిల్లా బీజెవైఎం అధ్యక్షుడు రాగం అర్జున్, సీనియర్ నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి, మోహన్ రావు, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, ఉపాధ్యక్షుడే మైసరి రాజు వంజరి, కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, నాయకులు వంశీ రెడ్డి, నాగరాజు, జంగం అనిత తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్‌లో జాతీయ జెండాఆవిష్కరించిన బిజెపి నాయకులు

**ఎల్లంపేట మున్సిపాలిటీలో ..**


ఎల్లంపేట మున్సిపాలిటీలోని సోమారం గ్రామంలో జాతీయ జెండావిష్కరించిన మున్సిపల్ బీజేపీ నాయకులు

**మేడ్చల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్లంపేట మున్సిపాలిటీలోని సోమారం గ్రామంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రజితా దేవేందర్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు పోచయ్య, సత్యనారాయణ, బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి మహేష్, మహిళా అధ్యక్షురాలు పుష్పారెడ్డి, నాయకులు వెంకటేష్, నాగేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పద్మారావు, జీవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**దుద్యాల్ తహసీల్దార్ కార్యాలయంలో..**

**దుద్యాల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** దుద్యాల్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కిషన్ జాతీయ జెండాను ఎగురవేసి ప్రజా పాలన దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువగా, పారదర్శకంగా అందించడంతో పాటు సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ శివకుమార్, ఆర్ఐ నవీన్‌కుమార్, జీపీవోలు పకీరప్ప, గోపాల్, రికార్డు అసిస్టెంట్లు ఉషప్ప, మారుతి తదితరులు పాల్గొన్నారు.


ప్రజా పాలన దినోత్సవంలో తహసీల్దార్ కిషన్,సిబ్బంది

**మోమిన్‌పేట్ మండలంలో..**

**మోమిన్ పేట్, సెప్టెంబరు 17. ప్రభాతవార్త:** తెలంగాణ "ప్రజా పాలన" దినోత్సవాన్ని పురస్కరించుకొని మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆయా గ్రామపంచాయతి కార్యాలయాలయందు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ సృజన సాహిత్య జాతీయపతాకకాన్ని ఆవిష్కరించగా ఇట్టి కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ చైర్మెన్ మహెందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్, మండల రెవెన్యూ తహశీల్దార్ మునీరుద్దీన్, వ్యవసాయాధికారి రామకృష్ణా రెడ్డి, మండల పరిషత్ పర్యవేక్షణాధికారి రాజలింగం, ఏఎంఆర్ఐ గోవర్ధన్ గౌడ్, ఎంపిఓ సంజయ్ కుమార్, మండల పరిషత్ సీనియర్ అధికారి మన్మోహన్, ఆయాగ్రామాల జీపీఓలు వెంకటపతి, వెంకట్‌రెడ్డి, మహేశ్ గౌడ్, మాణిక్ రెడ్డి, బాల్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, ఏఇఓ పెంటయ్య, మండల రెవెన్యూ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఆయా గ్రామాల పంచాయతి సర్పంచులు, పంచాయతి కార్యధర్శులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజాపాలన దినోత్సవ సంధర్భంగా జెండా ఎగురవేసిన ఎంపిడిఓ సృజన సాహిత్య.

**కొడంగల్‌తో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో..**

**కొడంగల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** కొడంగల్‌తో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ జాతీయ జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయాశాఖల అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి ప్రజాపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఇదిలావుండగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు జాతీయ జెండాను ఎగురవేసి ప్రజా పాలన దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు.


ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మేన్ తదితరులు


అప్పాయిపల్లిలో ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

**తలకొండపల్లి మండలంలో..**

**తలకొండపల్లి సెప్టెంబర్ 17 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలంలో గురువారం నాడు ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతారామమ్మ జాతీయ జెండాను ఎగరవేశారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, తాసిల్దార్ కార్యాలయంలో, తోపాటు ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాలలో జాతీయ జెండాలను ఎగురవేశారు. స్థానిక బిజెపి పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు రవి గౌడ్ జాతీయ జెండాను . ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, ఎంపీడీవో సీతారామమ్మ, తాసిల్దార్ రమేష్, వైద్యాధికారి స్నేహ, తోపటాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**రెపరెపలాడిన మువ్వన్నెల జెండాలు!**

**కొందుర్గు, జిల్లెడు చౌదరిగూడ, సెప్టెంబరు17 ప్రభాతవార్త :** తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండా రెపరెపలాడింది. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ విమోచన దినోత్సవం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వివిధ పార్టీల నాయకులు కార్యాలయాల సిబ్బంది మండల ప్రజలు పాల్గొన్నారు.


జెండాఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

**కొడంగల్ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ..**

**కొడంగల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ విలీన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కొడంగల్‌లో సిపిఐ పార్టీ అధ్వర్యంలో జాతీయ జెండాను అవిష్కరించారు. ఇందులో భాగంగా సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎండీ. మహిమూద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ విలీన దినోత్సవ వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాన్ని నడిపించింది ముమ్మాటికి కమ్యూనిస్టులే అని, కమ్యూనిష్టు త్యాగాల వల్ల వచ్చిన తెలంగాణాలో 1948 ప్రాంతంలో రజాకార్ల కాలంలో భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం 4500 మంది కమ్యూనిష్టులు తమ ప్రాణాలు అర్పించడం జరిగిందన్నారు. 10లక్షల ఎకరాల సాగుభూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదే అని అన్నారు. అలాగే రజాకార్ల ఆధీనంలో బందిగా ఉన్న 10వేల గ్రామాలకు విముక్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు ఇందనూర్ బషీర్, కొడంగల్, కోస్గీ, దౌల్తాబాద్, దుద్యాల మండలాల పార్టీ కార్యదర్శులు శ్యాంసుందర్, శ్రీనివాసులు, మూతుల రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అద్యక్షులు రహీం, చెట్టుపల్లి తండా సర్పంచ్ గోపాల్, నాయకులు లక్ష్మప్ప, బిచ్చప్ప, బసప్ప, ఎల్లప్ప, నాగేంద్రప్ప, మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

**షాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ..**

**షాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** హైదరాబాద్ సంస్థానం విమోచన దినోత్సవాన్ని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని షాబాద్ మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సేవా, దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా షాబాద్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం షాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి మాణయ్య, సీనియర్ నాయకుడు లంబాడీ రాము, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూతురు మహేందర్, హరీష్, శేఖర్, విజయ్, అనం తం, శ్రీశైలం, రాకేష్, గణేష్, మల్లికార్జున్, శివ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


షాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, పండ్లు పంపిణీ



గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత కెసిఆర్‌దే

కందుకూరు, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో వెనకబాటుతనానికి గురైన గిరిజనులకు అన్ని రంగాలలో అవకాశం కల్పించడానికి ఆనాటి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసి ప్రత్యేక గుర్తింపు కల్పించారని మాజీ మంత్రివర్యులు మహేశ్వరం శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం కందుకూరు మండల కేంద్రంలో జరిగిన గిరిజన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజానికి దూరంగా ఉన్న గిరిజనులకు సముచిత స్థానం కల్పించడానికి ఆరు శాతం ఉన్న అన్నిరకాల రిజర్వేషన్లను 10శాతంవరకు పెంచడం జరిగిందన్నారు. గ్రామ పరిపాలనా రంగాలలో గిరిజనులకు అవకాశాలు పెంచడానికి అనుబంధ గ్రామాలుగా ఉన్న గిరిజన గూడాలను తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు స్వయం పాలన అవకాశాలను కల్పించడం జరిగిందన్నారు. రిజర్వేషన్లను పెంచడం వలన ఉద్యోగ విద్య రంగాలలో గిరిజనులకు ప్రత్యేకంగా అవకాశాలు వచ్చాయని తెలిపారు. అదేవిధంగా గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచడానికి సేవాలాల్ మహారాజ్ వేడుకలకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలని హైదరాబాద్ నడిబొడ్డున బంజారాహిల్స్‌లో బంజారా భవన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గిరిజన గృహం నుండి వచ్చిన చిన్న ఆలోచన నేడు కళ్యాణ లక్ష్మిగా గుర్తింపు పొందింది అన్నారు. ప్రజాసేవయే పరమావధిగా నిరంతరం తెలంగాణ ప్రజల సంక్షేమానికి పాటుపడిన కెసిఆర్ ప్రజా హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని మళ్లీ ఆయన పాలన రావాలని తెలంగాణ ప్రజలు ఆశతో ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ చంద్రశేఖర్, బిఆర్ఎస్ నాయకులు లక్ష్మీ నరసింహా రెడ్డి, కాకి రాములు, దెక్కి తి రెడ్డి, లచ్చ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సంక్షేమం తండాల అభివృద్ధి బి ఆర్ ఎస్ దే

.. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



కందనెల్లి తండాలో మాట్లాడుతున్న రోహిత్ రెడ్డి

పెద్దేముల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త : గిరిజనుల సంక్షేమం తాండాల అభివృద్ధి గత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్ మండలం కందనెల్లి తండాలోఅంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రోహిత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత గిరిజనుల కోసం ప్రత్యేకంగా పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు . గిరిజనుల సంక్షేమ విషయంలో గత ప్రభుత్వ హాయంలో చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రస్తుత ప్రభుత్వం కూడా తండాల అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రోహిత్ రెడ్డి సూచించారు.ఈ కార్యక్రమంలో రుక్మాపూర్ మారేపల్లి తాండ మన్సాన్పల్లి మాజీ సర్పంచులు టి రమేష్ పాండు నాయక్ సంతోష్ నాయక్ రవి నాయక్ బిఆర్ఎస్ నాయకులు ధన్ సింగ్ జై సింగ్ తదితరులు పాల్గొన్నారు

## గిరిజనుల ఆత్మగౌరవానికి అనుగుణంగా కెసిఆర్ నిర్ణయాలు

-తాండూరు మాజి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

యాలాల, సెప్టెంబరు 17,ప్రభాతవార్త : గిరిజనుల సంక్షేమం, ఆత్మగౌరవానికి అనుగునంగా నిర్ణయాలు తీసుకున్న మాజి ముఖ్యమంత్రి కెసిఆర్ చరిత్రలో నిలిచిపోయారని తాండూరు మాజి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు.గురువారం పైలెట్ రోహిత్‌రెడ్డి యాలాల మండలం సంగాయిపల్లి తాండలో పర్యటించి గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన కెసిఆర్ చిత్రపటానికి గిరిజనులతో కలిసి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగ రోహిత్ మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వ హాయంలో గిరిజనుల రిజర్వేషన్‌లను 6శాతం నుంచి 10శాతానికి పెంచిన ఘనత కెసిఆర్‌దేనని తెలిపారు.రాష్ట్రంలో గిరిజనుల అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు రాష్ట్రంలో 183 గిరిజన గురుకులాలను ఏర్పాటు చేసిన ఘనత కెసిఆర్‌దేనని ఆయన వివరించారు.గిరిజనులకు విద్య,వైద్యం, విద్యుత్తు తదితర అన్ని సౌకర్యాలు కల్పించి గిరిజన బాంధవుడుగా నిలిచిపోయారని రోహిత్‌రెడ్డి గుర్తుచేశారు.ఎన్నికలప్పుడు మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరని,రానున్నవి బిఆర్ఎస్ రోజులని రోహిత్ చెప్పుకొచ్చారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి,మాజి జడ్పిటిసి సభ్యులు ఎస్.శ్రీనివాస్ ,నాయకులు సుక్యానాయక్,తార్యానాయక్,రమేష్,శ్రీకాంత్‌రెడ్డి ,గణేష్, రాజురెడ్డి,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సంగాయిపల్లి తాండలో కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పైలెట్

# రైతన్నకు వెన్నుదన్నుగా కాంగ్రెస్ ప్రభుత్వం

-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు17, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుసంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తుందని కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అన్నదాతకు వెన్నుదన్నుగా ఉంటూ రైతును రాజు చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. హార్టికల్చర్‌శాఖ ఆధ్వర్యంలో మంజూరైన 25 స్ప్రింక్లర్లను రైతులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం ముఖ్య అతిథిగా హాజరై మార్కెట్ కమిటీ చైర్మన్ యాటగీతనర్సింహ్మతో కలిసి మార్కెట్ యార్డు ఆవరణలో లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పథంలో పెట్టడంతో రికార్డు స్థాయిలో ధాన్యం పండించిందన్నారు. సాగునీరందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతుందని చెప్పారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం ధాన్యం దిగుబడులలో అంచనాలు చేరుకుందన్నారు. సన్నాలకు బోనస్, పంటలకు గిట్టుబాటుధరలు రైతుకు చేయూత నందిస్తున్నా యన్నారు. హార్టికల్చర్ ఆధ్వర్యంలో ఉద్యానవన పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని రైతన్నలు లబ్ధిపొందాలని సూచించారు. హార్టికల్చర్ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యానాయక్, జిల్లా నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహ్మముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం కేశవులు, పట్టణ అధ్యక్షుడు అర్వారి శివలింగం తదితరులు ఉన్నారు.



ఆమనగల్లులో రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

# కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం





జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 17, ప్రభాతవార్త: జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ధర్మాతాండ, చింతకుంటతాండలలో గురువారం తెలంగాణ రాష్ట్ర మాజి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి గిరిజనులు పాలభిశేఖం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గిరిజనులకు ఆరు శాతం ఉన్న రిజర్వేషన్లను 10శాతంకు పెంచినట్లు వారు తెలిపారు. కేసీఆర్ గిరిజనులకు పది శాతం రిజర్వేషనున్న పెంచి ఐదు సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలభిశేఖం చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోతిలాల్‌నాయక్, కిషన్, అనిల్, బీనిబాయి, కమిలిబాయి, రామ్‌చరన్, వినోద్, హన్మంతు, పాండు, బలరామ్, విశాల్, సురేష్ తదితరులు ఉన్నారు.

## గిరిజన జీవితాల్లో వెలుగుల సూరీడు మాజీ సిఎం కెసిఆర్

నందిగామ, సెప్టెంబరు 17, ప్రభాతవార్త : ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనకబడిన గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి వారి తలరాతలు మార్చడమే కాకుండా, గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ ప్రకటించి నాలుగేండ్లు పూర్తి అయిన సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చిత్రపటాలకు గురువారం బండోనిగూడ ఉప సర్పంచ్ రామ్ ఆధ్వర్యంలో గిరిజనులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ జట్ట కుమార్ హాజరై వారితో పాటు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచు జట్ట కుమార్ మాట్లాడుతూ మారుమూల తండాలలో అక్షరాస్యత లేక భూమిని నమ్ముకొని, కొండ కోనల్లో, చెట్టు చేమల్లో దుర్భర జీవితాలు అనుభవించిన గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ తో పాటు, వెనుకబడిన గిరిజన గ్రామాలను గ్రామ గ్రామపంచాయతీలుగా మార్చి వారి జీవితాలను మార్చిన ఘనత కేవలం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, షాద్నగర్ నియోజకవర్గం లోని మాజీ ఎమ్మెల్యే అంజయ్యకే సాధ్యమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఆటకెక్కాయని, సంక్షేమ పథకాల అమల్లో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మళ్లీ కెసిఆర్ సారు రావాలి.. కారు సర్కార్ రావాలని జనం కోరుకుంటున్నారని పేర్కొన్నారు.



శామీర్‌పేట ప్రభుత్వ ఐటిఐ స్నాతకోత్సవ కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.నర్సయ్య,పలువురు సంబంధిత అధికారులు, జిల్లా అధికారుల దృశ్యం

## సాంకేతిక నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలి

శామీర్‌పేట, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:

విద్యార్థులు సాంకేతికంగ నైపుణ్యాలను, ప్రతిభను పెంపొందించుకుని ఉపాది అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ డిప్యూటీ డైరక్టర్ పి.నర్సయ్య సూచించారు. గురువారం శామీర్‌పేట ప్రభుత్వ ఐటిఐలో స్నాతకోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. దీనిలో శిక్షణ పూర్తి చేసుకున్న ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, ఇండస్ట్రీస్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మ్యానుఫాక్యరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ఆయనతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా . రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.నర్సయ్య మాట్లాడుతూ ఐటిఐ శిక్షణ పొందిన యువతకు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించటంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వం ఐటిఐల్లో ఎటిసి సెంటర్లను కూడ ఏర్పాటు చేసి విద్యార్థులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు వృత్తినైపుణ్యాన్ని ప్రతిభను ఉపయోగించి ఉద్యోగ అవకాశాలను పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సహాయ సంచాలకులు కెవి చంద్రశేఖర్, ప్రాంతీయ డిడి బి.సీతారాములు, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి,టిజిఓల అధ్యక్షులు జి.వినోద్‌కుమార్, డిఆర్‌డిఓ సాంబశివరావు, టిజిఓ కార్యదర్శి డాక్టర్ ఎ.కురుమూర్తి, శిక్షణా అధికారి ఆర్‌డిడి టి.సాయిబాబ, ఐటిఐ ప్రిన్సిపల్ బి.హరికృష్ణ, ఐటిఐ శిక్షణ ఆధికారి డి.రవీందర్, సూపరిండెంట్ వెంకటరాజు, సంబంధితులు, సిబ్బంది,కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్‌పై సమీక్షించి మాట్లాడుతున్న కీసర డివిజన్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, బిఎల్‌ఓల దృశ్యం

## శామీర్‌పేటలో ఎస్ఐఆర్‌పై సమీక్ష

శామీర్‌పేట, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:ఎస్ఐఆర్‌ను సమర్ధవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు, బిఎల్‌ఓలు సమన్వయంతో పనిచేయాలని, ఎస్ఐఆర్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని కీసర డివిజన్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి ఆదేశించారు. గురువారం శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి ఎస్ఐఆర్‌పై అధికారులతో, బిఎల్‌ఓలతో సమీక్షించారు. శామీర్‌పేట మండలంలో కొనసాగు తున్న ఎస్ఐఆర్ పనుల పురోగతిని ఆర్డీఓ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారు లకు, బిఎల్‌ఓలకు సూచించారు. అవసరమైన సందర్భాల్లో రాజకీయ ప్రతినిధుల, పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకుని సంబంధిత సమాచారాన్ని త్వరితగతిన సేకరించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఎస్ఐఆర్ పనులపై ఆయన అధికారులను, బిఎల్‌ఓలను వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ మల్లిఖార్జున్, ఎస్ఐఆర్ ట్రైనర్ తిరుమలేశ్, అధికారులు, సిబ్బంది, బిఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## మూడుచింతలపల్లిలో విశ్వకర్మ జయంతి



మూడుచింతలపల్లిలోని శ్రీ గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా శ్రీస్వామి వారిని దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్ జాము రవి, పాల్గొన్న నాయకులు, విశ్వకర్మ సంఘం సభ్యులు తదితరులు

శామీర్‌పేట, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని శ్రీగోవిందమాంబ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం మూడుచింతలపల్లిలో ఆ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల విశ్వకర్మ సంఘం వారి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో యజ్ఞం, హోమాలు,పూజలు,అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి పాల్గొని శ్రీస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆ తరువాత ఆలయ నిర్వాహకులు కమిటీ వారు చైర్మన్ జాము రవిని సన్మానించారు. వివిధ గ్రామాల నుంచి విశ్వకర్మ సంఘాల సభ్యులు, భక్తులు పాల్గొని శ్రీస్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు, కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో మోదీ జన్మదిన సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేస్తున్న చేవెళ్ల సీనియర్ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి

## గ్రామ స్థాయిలో బిజెపిని బలోపేతం చేయాలి

-చేవెళ్లలో ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

-సీనియర్ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి పిలుపు

చేవెళ్ల, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:చేవెళ్లలో ఘనంగా మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం మోదీ జన్మదినం సందర్భంగా చేవెళ్ల ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా చేవెళ్లలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల సీనియర్ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డిమాట్లాడుతూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా ప్రజాసేవా కార్యక్రమాల దినంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు సేవ చేయడం, పేదలు మరియు అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం బీజేపీ కార్యకర్తల బాధ్యత అని పేర్కొన్నారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోగులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ప్రధాని నరేంద్ర మోదీ గారి జన్మదినం సందర్భంగా దేశ ప్రజల నుంచి అందుతున్న ఆశీర్వాదాలు తనను మరింత అంకితభావంతో దేశ సేవ చేయడానికి ప్రేరేపిస్తున్నాయని ఈరోజు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనంత్ రెడ్డి, డాక్టర్ వైభవ్ రెడ్డి,చేవెళ్ల బీజేపీ కౌన్సిలర్స్ పెద్దోళ్ల దయాకర్ మనీష్ అనంత్ రెడ్డి మీరాజ్ల సత్యనారాయణ, బీజేపీ నాయకులు, చేగురు ప్రవీణ్ రెడ్డి పత్తి సత్యనారాయణ అశోక్ చంద్రశేఖర్ రెడ్డి పురుషోతం రెడ్డి మల్లేష్ మధుసూదన్ రెడ్డి శ్రీనివాస్ శ్రీనివాస్ రెడ్డి తెలుగు శ్రీనివాస్ చంద్రయ్య గణేష్ రాజు బీరప్ప శ్రీకాంత్ కరుణాకర్ కార్యకర్తలు, అభిమానులు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## విశ్వకర్మల అభివృద్ధికి నిత్యం శ్రమిస్తా : పైలెట్ రోహిత్ రెడ్డి

పెద్దేముల్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త: తాండూర్ మండలం కందనెల్లి, ఖాంజాపూర్ గ్రామాల్లోని బ్రహ్మంగారి దేవాలయంలో నిర్వహించిన విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు ఆయనను మేళతాళాలతో స్వాగతించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. విశ్వకర్మ సామాజిక వర్గానికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీసీల సంక్షేమానికి బీఆర్ఎస్ హయాంలో పెద్దపీట వేయడం జరిగిందని, రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించామని గుర్తుచేశారు. తమకు పదవులు కల్పించి, వెన్నంటి నిలిచిన రోహిత్ రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇస్తామని విశ్వకర్మ సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సంఘం సభ్యులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### చరిత్రను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత

కొత్తూరు, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:

తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి పోరాట చరిత్రను భావితరాలకు అందించాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, పెంజర్ల సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ పిలుపునిచ్చారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో జాతీయ త్రివర్ణ పతాకాన్ని సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాం పాలనలో రజాకార్ల అరాచకాలను ఎదుర్కొంటూ ప్రజల స్వేచ్ఛ కోసం అనేక మంది ఉద్యమకారులు పోరాటం చేశారని గుర్తుచేశారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోరాటయోధులు, అమరవీరుల సేవలను ఎప్పటికీ మరువ కూడదన్నారు. తెలంగాణ విమోచన పోరాటానికి సంబంధించిన చరిత్రను నేటి తరం తెలుసుకోవడంతో పాటు, రాబోయే తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వీరుల త్యాగాలను స్మరించుకోవడం ద్వారా వారి స్ఫూర్తిని సమాజంలో కొనసాగించాలని జగన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీట, పంచాయతీ కార్యదర్శి గౌస్, ఉప సర్పంచ్ శంతన్ రెడ్డి, మంద మాధవి, కే. వేదాంతాచారి, ఆశా వర్కర్ కోళ్ల లక్ష్మి ్మ, దేశాల జైపాల్‌తో పాటు విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



శివశక్తియూత్ మండపంలో భజన చేస్తున్న మార్కేండేయ భజన బృందం

## గణనాథుడి సన్నిధిలో భజన సందడి

ఆమనగల్లు, సెప్టెంబరు17, ప్రభాతవార్త: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ప్రత్యేక మండపాలలో కొలువుదీరిన గణనాథులను భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఉత్సవ కమిటీలు అన్నప్రసాదాల వితరణ చేపట్టి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. పట్టణంలోని ప్రతి వీధులలో నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తుంది. మున్సిపాలిటీ 15వార్డులో శివశక్తి యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడి సన్నిధిలో బుధవారం రాత్రి భక్తమార్కేండేయ భజన మండలి సభ్యులతో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ ఎంగలి భాగ్యలక్ష్మీరఘు దంపతులు ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి భజనలో చేశారు. అనంతరం భజన బృందాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ప్రత్యేక భజన గీతాలతో నవరాత్రి ఉత్సవాలకు మరింత ఆధ్యాత్మిక శోభ, భక్తిమార్గం సంతరించుకుందని భాగ్యలక్ష్మీరఘు అన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎంగలి తరుణ్, భజన బృందం పాలాది శ్రీనివాస్, శ్రీశైలంయాదవ్, గాజుల వెంకటేశ్, ఎంగలి రఘు, మధు, ఎంగలి యాదగిరి, ఉమాపతిగౌడ్ తదితరులు ఉన్నారు.



కోట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో గణేష్ నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న ధారూర్ సిఐ రఘురాములు

## గణేష్ నిమజ్జనాలు శాంతియుతంగా నిర్వహించాలి

కోట్‌పల్లి, సెప్టెంబరు,17 ప్రభాతవార్త; గణేష్ నిమజ్జనాలు శాంతియుతంగా నిర్వహించాలని ధారూర్ సీఐ రఘురాములు అన్నారు. గురువారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో గురువారం నాడు మండల ప్రజలు, గణేష్ మండపాల నిర్వహకులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా అయన మాట్లాడుతూ. గణేష్ మండపాల నిర్వహకులు నిమజ్జన కార్యక్రమాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలన్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహకులు, మండల ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. నిమజ్జన కార్యక్రమాల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. పోలీసుల సూచనలు, నిబంధనలను ప్రతి ఒక్కరు తప్పని సరిగా పాటించాలన్నారు. నిమజ్జన ఊరేగింపుల సమయంలో ప్రజలకు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా యువత ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా సంయమనంతో వ్యవహరించాలని అయన సూచించారు. మండల ప్రజలందరూ గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా పూర్తి చేయాలని అయన పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో ఎస్సై శైలజ, ఎంపీడీఓ హేమంత్, తదితరులు పాల్గొన్నారు,



లక్కీడ్రా లో విజేత కలిగిన వారికి బహుమతులు అందజేస్తున్న కమిటీ సభ్యులు

## ధారూర్‌లో వైభవంగా వినాయక లక్కీడ్రా

.. విజేతలకు సైకిల్ అందజేత

ధారూర్, సెప్టెంబరు 17, ప్రభాత వార్త: ధారూర్ మండల కేంద్రంలో గ్రామ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన లక్కీ డ్రా ఉత్సవం గ్రామస్థుల సమక్షంలో అత్యంత కోలాహలంగా ముగిసింది. భక్తులు, ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా తీసిన ఈ లక్కీ డ్రాలో ఇద్దరు అదృష్టవంతులు బహుమతులను గెలుచుకున్నారు.

గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన ఈ డ్రాలో మొదటి బహుమతి చాకలి చెంద్రయ్యకు దక్కగా, రెండవ బహుమతి టి.లహరిని వరించింది. విజేతలుగా నిలిచిన వారికి ఉత్సవ కమిటీ సభ్యులు ఆకర్షణీయమైన సైకిళ్లను బహుమతిగా అందజేశారు. వినాయక నిమజ్జనోత్సవాలు లక్కీ డ్రా విజయవంతం కావడానికి ఆర్థికంగా, నైతికంగా సహకరించిన ప్రతి ఒక్క గ్రామస్థునికి, భక్తులకు ఉత్సవ కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అశోక్ ముదిరాజ్, మహేష్, రఘు గౌడ్, శశాంక్, మల్లేష్ ముదిరాజ్, గిరి గౌడ్, కుమ్మరి రాము, శివ, వెంకట్, గజిని, రాజేష్ తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నిమజ్జన ఊరేగింపులకు పటిష్ట బందోబస్తు

కొత్తూరు, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త:

వినాయక నిమజ్జనం, శోభాయాత్రలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని కొత్తూరు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. కొత్తూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో వినాయక మండపాల ఏర్పాటుకు దాదాపు 198 ఆన్‌లైన్ దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో సంబంధిత ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బందితో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు సీఐ వెల్లడించారు. నిమజ్జన ఊరేగింపులు జరిగే మార్గాలు, నిమజ్జన ప్రాంతాలను ముందుగానే పరిశీలించి అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.

**డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా**

ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్‌లోని ప్రత్యేక సిబ్బందితో నిరంతరం పర్యవేక్షి స్తున్నామని తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు తగిన సంఖ్యలో వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**మండపాల వద్ద అప్రమత్తత తప్పనిసరి**

రాత్రి వేళల్లో మండపాల వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా కాపలా ఉండాలని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ సూచించారు. విగ్రహాల ఊరేగింపులు పోలీసులు సూచించిన మార్గాల్లోనే నిర్వహించాలని, మార్గం మార్చాల్సిన అవసరం ఉంటే ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు.

**నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి**

నిమజ్జనం సమయంలో నదులు, చెరువులు, కాలువల్లో లోతైన ప్రాంతాలకు ఎవరూ వెళ్లరాదని సీఐ హెచ్చరించారు. ఈత వచ్చిన నాలుగు నుంచి ఆరుగురు వ్యక్తులు మాత్రమే నిమజ్జన ప్రక్రియలో పాల్గొనాలని, ఈత రాని వారు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిలోకి దిగరాదన్నారు. ఊరేగింపుల్లో మద్యం, మత్తు పదార్థాలకు తావులేదని, అసభ్య నృత్యాలు, అనుచిత ప్రదర్శనలు నిర్వహించరాదని సూచించారు. భారీ వాహనాలు, లారీలపై ఆర్కెస్ట్రాలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. రాజకీయ, కుల, మత వైషమ్యాలను రెచ్చగొట్టే పాటలు, ప్రసంగాలు చేయరాదని, కర్రలు, ఆయుధాలతో ఊరేగింపుల్లో పాల్గొనకూడదని స్పష్టం చేశారు.

**బాణసంచాపై ఆంక్షలు**

రద్దీ ప్రాంతాలు, పెట్రోల్ బంకులు, ఆసుపత్రుల సమీపంలో బాణసంచా కాల్చడం పూర్తిగా నిషేధమని సీఐ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా గుర్తుతెలియని వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీసు శాఖ నిబంధనలను ఉల్లంఘించి నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకుంటే సంబంధిత అర్జీదారులు, నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని సీఐ నాగార్జున రెడ్డి స్పష్టం చేశారు. భక్తులు, నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించి వినాయక నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు.